


# కరపత్రం

SINCE 2014

బుధవారం జూలై 22, 2026 | సంపుటి : 2 | సంచిక : 280 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనుల్లో జాప్యం

## అధికారులపై మండిపడ్డ సిఎం రేవంత్



హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులు నిదానంగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేసారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఎడ్యుకేషన్ హబ్ లో ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించి నెలవారీ పురోగతిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఆదేశం ఇచ్చారు. పనుల్లో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవన్న సీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్ కు వెనకాడొద్దన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలు లబ్దిదారులకు అందజేయాలని ఆదేశించారు.




### ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం

# అప్రమత్తం

## ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం

- వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి
- కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి
- హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి

**హన్మకొండ,జులై 21 :**
రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు.



## రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

- ఎల్‌నినోతో వర్షాభావంపై అధికారులతో చర్చలు
- కార్యాచరణతో ముందుకు సాగాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశం

**రంగారెడ్డి,జూలై21 :**
ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున రైతులను పండ్ల తోటలు, అరుతడి పంటల వైపు మళ్లించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులకు సూచించారు.

2లో..




## ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

- సాగు,తాగునీటి సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్,జూలై21 :**
ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎల్ నినోపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలంలోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు. గ్రిడ్ స్థిరత్వానికి స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కూడా ఎల్ నినో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.



## హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు చేదు అనుభవం

- గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని సెక్యూరిటీ సూచన
- రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్,జూలై21 :**
హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో చేదు అనుభవం ఎదురైంది.



2 లో

## ములుగు జిల్లాలో విస్తారంగా వర్షాలు

» జోరు వానలకు తెగిపోయిన రోడ్డు

**ములుగు,జూలై21**
ములుగు జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల వృక్షాలు నేలకూలాయి. వాజేడు మండలంలోని జాతీయ రహదారి 163 పై ఇసుక వాగు బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు వర్షానికి తెగిపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి.



2 లో

## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

» అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

» ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి

**హైదరాబాద్,జూలై21 :**
బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు.

## జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

- ప్రజల నుంచి పదివేల కోట్లు వసూళ్లకు పన్నాగం
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు



2లో..

### నలుగురు రైతులు చనిపోయినా

## బాధ్యత లేదా

- వారికి కనీసం రూపాయి కూడా పరిహారంగా ఇవ్వరా
- కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన బిఆర్ఎస్ నేత కెటిఆర్
- పార్టీ తరపున ఒక్కో కుటుంబానికి 5 లక్షల సాయం అందచేత



2 లో



## ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ నేతల ఆందోళన



- కాంగ్రెస్ ధర్నాతో స్వల్ప ఉద్రిక్తత
- బలవంతంగా అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు
- రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్

**న్యూఢిల్లీ,జులై 21 :**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు.





మిగతాది 2లో

## సన్న వడ్ల కుంభకోణం గతంలో జరిగిందేమో

» ఈ ప్రభుత్వంలో అలాంటిదేమీ జరగలేదు

» హరీష్ రావు తదితరుల విమర్శలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్



**హైదరాబాద్,జూలై21 :**
ఈ ప్రభుత్వంలో సన్న వడ్ల కుంభకోణం అనేది అవాస్తవమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై మీడియా - సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు.

2లో..

## ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

» కెకె కమిటీకి నివేదిక అందించిన కవిత

**హైదరాబాద్,జులై 21 :**
ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.



# నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెచ్చిన ధాన్యం 30 రోజులు, 60 రోజులైనా కొనేటోడు దిక్కు లేడు.. సంచులు ఇచ్చేటోడు దిక్కులేడు. ఈ దిక్కు దివానం లేని ప్రభుత్వంలో అన్నదాతకు దిక్కులేని పరిస్థితి వస్తే ఆ పంటను కాపాడుకునే ఆ కొనుగోలు కేంద్రం దగ్గరే కాపు కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనకపోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్షెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరపున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు. ఆ రోజు మేం వరంగల్‌లో ఉన్నం.. రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. అదే రోజు ఈ బాధాకరమైన సంఘటన జరిగింది. వెంటనే కేసీఆర్‌ను అడిగినం. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఈ విషాదానికి పార్టీ తరపున తప్పకుండా మనం అండగా నిలబడదాం.. ఒక్కో రైతుకు రూ.5 లక్షలు వెంటనే ప్రకటించాలని కేసీఆర్ చెప్పారన్నారు. ఇవాళ శోకసంద్రంలో ఉన్న రైతు కుటుంబాలను నేను అడిగిన. ప్రభుత్వం నుంచి ఏమన్నా వచ్చిందా అమ్మా అని అడిగిన. రెండున్నర నెలలు అయిపోయింది.. మంచిర్యాలలో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. జరిగింది ఒక విషాదం.. ఏ రాజకీయ పరమైన హడావిడి లేదు.. ఏ ఆర్భాటం లేదు.. ఏ ఎన్నిక లేదు.. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. నలుగురితో మాట్లాడుతుంటే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వాళ్లందరు చెప్పింది ఒక్కటే మాట.. ఇవాళ నలుగురు రైతులు చనిపోతే ఒక్క రైతుకు మాత్రమే రూ.5 లక్షలు వచ్చింది. అది కూడా ఎక్కడిది.. కేసీఆర్ పెట్టిన రైతు బీమా నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. కానీ మిగిలిన ముగ్గురికి రూ.5 లక్షలు కాదు కదా.. రూ.5 వేలు కాదు.. 5 పైసలు కూడా ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చేరకున్న కేటీఆర్ లక్షెట్టిపేట సమీపంలోని అంకతిపల్లిలోని వాసవీ ఫంక్షన్‌హాలుకు చేరుకుని రైతు సదస్సులో పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.

దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశు సంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటి స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ నేతల ఆందోళన

ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత దిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్‌గాంధీ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ధి కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు'అని జితేంద్రసింగ్ అన్నారు.

# సన్న వడ్ల కుంభకోణం గతంలో జరిగిందేమో

మొదటిపేజీ తరువాయి

కొందరు కావాలని సన్న వడ్ల కుంభకోణం అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఈ కుంభకోణం జరిగి ఉండవచ్చని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. ధరలు పెంచి టెండర్ కోడ్ చేస్తే.. ఎవ్వరూ ముందుకు రాలేదని అన్నారు. అందుకే మళ్ళీ పిలిచారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదలలో ఎక్స్‌పర్ట్ అయితే.. హరీశ్ రావును మంత్రి పదవి నుంచి కేసీఆర్ ఎందుకు తొలగించారంటూ ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ముందు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావుకు సూచించారు. దేవాదులలో 7 పంపులు నడుస్తున్నాయని.. నేడు మరో రెండు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రూ.14 వందల కోట్ల సంగతి ఏమిటో ముందు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## జిహెచ్‌ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

మొదటిపేజీ తరువాయి

జీహెచ్‌ఎంసీ ఎన్నికలు వస్తున్నాయనే ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతోందని బిజెపి దుయ్యబట్టింది. 7వేల ఇళ్లకు 10వేల దరఖాస్తులు వస్తాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.10వేల చొప్పున తీసుకుంటే ప్రభుత్వానికి రూ.వెయ్యికోట్ల రాబడి వస్తుందని, క్యూర్ పేరుతో ప్రజలకు ప్రభుత్వం పెయిన్ తెస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాంపల్లిలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యూర్‌లో శాస్త్రీయ బద్ధమైన పన్నుల విధానం లేదు. ట్యాక్స్ దోపిడీతో ప్రజలపై భారం పడుతుంది. ఈ చట్టాన్ని రెసిడెన్షియల్ అసోసియేషన్లు వ్యతిరేకిస్తున్నాయి. ఇది సరైన చట్టం కాదు. ఎవరితోనూ చర్చించకుండా దీన్ని అమలు చేస్తున్నారు. "రాజీవ్ స్వగృహ పేరుతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఇళ్లు అలాగే ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి పేదలకు ఇవ్వాలి. క్యూర్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే చట్టాన్ని అమలు చేయాలన్నారు. రూ.వెయ్యి కోట్ల కోసం పేదల నుంచి రూ.10వేలు తీసుకోవడం సరికాదని రామచందర్‌రావు అన్నారు.

# డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీలతో ముఖాముఖి

## ఉద్యమకారుల సమగ్ర సంక్షేమానికి పర్మినెంట్ కార్పొరేషన్

**– చట్టబద్ధత ఇవ్వాలని జెఏసిల డిమాండ్**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సంప్రదింపులు కొనసాగిస్తోంది. మంగళవారం వైద్యులు, న్యాయవాదులు, విలేఖరులుసమక్షంలో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పలువురు ప్రముఖ సామాజిక నాయకులు మరియు వివిధ వర్గాల అగ్రశ్రేణి ప్రతినిధులు హాజరయ్యారు, అల్లం నారాయణ (సీనియర్ జర్నలిస్ట్ నాయకులు), ఎమ్. రాజేందర్ రెడ్డి (అడ్వకేట్ జేఏసీ కన్వీనర్), ఎస్. సత్యం రెడ్డి (హైకోర్టు మాజీ ప్రెసిడెంట్), టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. సమావేశానికి తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత స్వయంగా హాజరై కమిటీకి తమ పూర్తి మద్దతును ప్రకటించారు. భారత స్వాతంత్య సంగ్రామ సమయంలో నాటి ఉద్యమకారుల గుర్తింపు కొరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పలు చారిత్రాత్మక జీవోల ప్రతులను కమిటీ ప్యానల్‌కు సమర్పించారు. జార్ఖండ్ తో పాటు ఇతర కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాల్లో అమలు చేసిన ఉద్యమకారుల గుర్తింపు విధానాలను పరిశీలించి, తెలంగాణలో త్వరితగతిన అర్హుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. విజ్ఞప్తిపై కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు స్పందిస్తూ.. 'నేను జార్ఖండ్ రాష్ట్రానికి 3 సంవత్సరాల పాటు ఇన్ ఛార్జ్‌గా పనిచేశాను. అక్కడ అమలైన విధానాలపై నాకు పూర్తి అవగాహన ఉంది. అంతకంటే మెరుగ్గా, నిబద్ధతతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం. అన్ని రాజకీయా పార్టీల నుండి, ప్రజా సంఘాల నుండి వచ్చే సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు. పర్మినెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులలో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మిటీ సభ్యులు మాట్లాడుతూ.. జర్నలిస్టులు, డాక్టర్లు, అడ్వకేట్లు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రాన్ని సాధించారని, వారి ప్రతి డిమాండ్ అత్యంత సమంజసమైనదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో రికార్డ్ చేసిన ఆధారాల ద్వారా ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామని, ఈ విజ్ఞప్తులన్నింటినీ క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదిస్తామని స్పష్టం చేశారు.

# హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు చేదు అనుభవం

మొదటిపేజీ తరువాయి

వీఐపీలు ప్రవేశించే గేట్ నంబర్ 6 నుంచి కాకుండా, సామాన్య ప్రజలు ప్రవేశించే గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని రంగనాథ్‌కు సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. దీంతో గేట్ నంబర్ 4 వద్ద సామాన్య ప్రజలు వాహనాలు పార్క్ చేసే స్థలంలో కారు పార్క్ చేసి, అక్కడి నుండి నడుచుకుంటూ కోర్టులోకి వెళ్లారు.

కాగా, ప్రైవేట్ ఆస్తి వివాదంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఒకే అంశానికి సంబంధించి ఏకంగా మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవడం అత్యంత తీవ్రమైన విషయమని వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం వెనుక కారణమేమిటని నిలదీసింది. ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని స్పష్టమైన ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని లెకచేయకుండా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన అలవాటుగా మారిందా? కోర్టు ధికరణనే పరిపాటిగా మార్చుకున్నారా? అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకటి కాదు, రెండు కాదు, ఒకే అంశంపై మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవుతున్నా యంటే కోర్టు ఉత్తర్వుల పట్ల ఎంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతున్న దని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టుల పట్ల ఎంత గౌరవం ఉన్నదో ఈ పరిణామాలే చెప్తున్నాయని పేరొంది. ఇకడ బాధితుడు పిటిషనర్ కాదని, స్వయంగా కోర్టేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వులను ధికరించడం ఎంతమాత్రం సహించబోమని రంగనాథ్‌కు తేల్చిచెప్పింది. ప్రభుత్వమైనా, ప్రభుత్వాధికారులైనా చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల పరిరక్షణ పేరుతో కోర్టు ఉత్తర్వులను పకనపెట్టి ప్రైవేటు భూముల్లోకి వెళ్లడం ఏ చట్టం ప్రకారం సమర్థనీ యమని ప్రశ్నించింది. యజమాని అనుమతి లేకుండా ప్రైవేటు భూమిలో అడుగు పెట్టరాదన్న ప్రాథమిక సూత్రం తెలియదా అని నిలదీసింది. ప్రభుత్వ భూమిని రక్షించడమే లక్ష్యమైతే ప్రైవేటు వ్యక్తిపై పోలీసు ఫిర్యాదు ఎందుకు చేశారని ప్రశ్నించింది.

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

మొదటిపేజీ తరువాయి

మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో ఎన్నో విపత్తులు ఎదుర్కొన్నామని.. ఎన్‌లినోను కూడా ఎదుర్కుంటామన్నారు. అమ్మవారి కృపాకటాక్షంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. సంవృద్ధిగా వర్షాలు పడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆషాఢమాస బోనాలు ఘనంగా జరిగేలా దేవాదాయ శాఖ తరఫున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్ని ఏర్పాట్లు చేసినా చిన్న చిన్న ఇబ్బందులు జరుగుతుంటాయని.. వాటిని అధిగమించి అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకోవాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర మీద ఉండాలని, సుఖశాంతులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# ములుగు జిల్లాలో విస్తారంగా వర్షాలు

మొదటిపేజీ తరువాయి

జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో పలుచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో సగటున 7.66 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాజేడు, వెంకటాపురం మండలాల్లో గరిష్ఠంగా 11 సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదైంది.ఆయా చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురవడంతో చెరువులు, కుంటలు, వాగులు నిండుకుండను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని పర్యవేక్షిస్తూ చర్యలు చేపడుతున్నారు.

## రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

మొదటిపేజీ తరువాయి

మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తీవ్రత ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులను తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, పండ్ల తోటలు, అరుతడి పంటలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌నినో బారిన ప్రజలు పడకుండా చూసే బాధ్యత పూర్తిగా జిల్లా యంత్రాంగంపైనే ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలని, అవసరమైన చోట నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.కార్యక్రమం చివరలో వర్షపు నీటి సంరక్షణ కు సంబందించిన తెలంగాణ జలసిరి పోస్టర్ విడదల చేశారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, శంకర్, కాలే యాదయ్య ఇంకా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వివిధ విభగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

మొదటిపేజీ తరువాయి

ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి మంగళవారం ఆమె అందజేశారు. అనంతరం ట్యాంక్ బండ సమీపంలోని అమరజ్యోతి వద్ద ఆమె మాట్లాడుతూ.. స్వతంత్ర సైనిక సమ్మాన్, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఈ సందర్భంగా ఆ కమిటీకి సూచించారు. వాటిలో ఉన్న విధంగా ఉద్యమకారులకు ప్రయోజనం కలిగించాలని స్పష్టం చేశారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది.. అది తప్పని నిరూపించాలని ఆ కమిటీ చైర్మన్‌తో ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారుల కోసం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పోరాటం చేసి బలైన వ్యక్తిని తానని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంత మేలు జరిగితే తన జన్మ ధన్యమైనట్లేనని టీఆర్ఎస్ చీఫ్ కవిత తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా కె. కేశవరావును నియమించింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం జూలై 22, 2026

# ప్రతి ఓటరు ఎస్ఐఆర్ దరఖాస్తు పత్రాన్ని తప్పనిసరిగా బీఎల్ఓకు అందజేయాలి

- మహమ్మద్ రహీమ్ ఖాన్ ఆవాజ్ ప్రధాన కార్యదర్శి

**కరపత్రం ప్రతినిది వరంగల్,జూలై 21**



వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏనుమాముల 14వ డివిజన్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) దరఖాస్తు పత్రాల నింపే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆవాజ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ రహీమ్ ఖాన్ మాట్లాడుతూ..వరంగల్ జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎస్ఐఆర్ దరఖాస్తు పత్రాన్ని పూర్తిగా నింపి నిర్ణీత గడువులోగా సంబంధిత బూత్ స్థాయి అధికారి(బీఎల్ఓ)కి తప్పనిసరిగా అందజేయాలని కోరారు.గడువులోగా దరఖాస్తు పత్రాలు సమర్పించకపోతే ఓటరు హక్కు పరిగణనలోకి రాకపోయే అవకాశం ఉందని,తద్వారా ఓటు హక్కు వినియోగంలో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని తెలిపారు.అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను బాధ్యతగా తీసుకుని ఎస్ఐఆర్ దరఖాస్తు పత్రాలను బీఎల్ఓలకు అందజేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఇబ్రహీం,ఇమ్రాన్ తాహిర్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నమోదు కార్యక్రమానికి బజరంగ్ సేన మద్దతు

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూలై 21**




బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణరావు, తమ సంస్థ బృంద సభ్యులతో కలిసి మంగళవారం బేగం బజార్ వార్డు కార్యాలయంలో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నమోదు కార్యక్రమంలో పాల్గొని, తమ మద్దతును అందించారు.ఈ బృందం స్థానిక నివాసితులు మరియు అధికారులతో మమేకమై, అర్హులైన పౌరులు తమ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రోత్సహించింది. అలాగే ఈ కార్యక్రమంలో పౌర భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. ఈ సందర్భంగా ఎన్.ఆర్. లక్ష్మణరావు మాట్లాడుతూ.. కొనసాగుతున్న సర్ కార్యక్రమానికి ప్రజలు చురుకుగా సహకరించాలని, వారి వివరాలు సరిగ్గా నమోదు అయ్యేలా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం అంతటా బజరంగ్ సేన తెలంగాణ సభ్యులు అక్కడే ఉండి, ప్రజలలో అవగాహన కల్పించడంలో సహాయపడ్డారు. అలాగే ఈ ప్రాంతంలో పౌర మరియు పరిపాలనా కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడంలో తమ సంస్థ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు.

# నీట్ అంశంపై ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ ధర్నా..

- కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ తో కలిసి ధర్నాలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**కరపత్రం ప్రతినిది బ్యూరో, జూలై 21**



నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ నివాసం సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఎంపీ ప్రియాంక గాంధీతో పాటు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఇతర కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. ధర్నా సందర్భంగా కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలు, పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. విద్యార్థుల న్యాయమైన ఆందోళనలను అణిచివేసే విధంగా లాఠీచార్జ్ జరగడం బాధాకరమని అన్నారు. యువతపై జరిగిన ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీ వంటి అత్యంత కీలకమైన అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడం విచారకరమని ఎంపీ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనం కనిపించడం లేదని విమర్శించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, నీట్ వ్యవహారంపై ప్రధాని మోదీ మౌనం వీడి దేశ ప్రజలకు, విద్యార్థులకు సమాధానం చెప్పాలన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఎంపీ స్పష్టం చేశారు.

## సిక్కింలో ఘోర విషాదం

## నిర్మాణంలో ఉన్న సొరంగంపై విరిగిపడ్డ కొండచరియలు

సిక్కింలో ఘోర విషాదం చోటుచేసుకుంది. దక్షిణ సిక్కింలోని సమర్‌దుంగ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగం వద్ద కొండచరియలు విరిగిపడటంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటివరకు పదిమంది మృతిచెందారు. వారి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు. మరో 20 మందికిపైగా కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను నామ్చి జిల్లా కలెక్టర్ అనుప తమ్లింగ్ వెల్లడించారు. సోమవారం తీస్తా స్టేజ్-జలవిద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన సొరంగంలో ఈ ప్రమాదం జరిగింది. పటేల్ ఇంజినీరింగ్ సంస్థ నిర్మాణ పనులు నిర్వహిస్తుండగా, సొరంగం లోపల అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడి మార్గం పూర్తిగా మూసుకుపోయింది. అదే సమయంలో మీథేన్ గ్యాస్ లీక్ కావడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ఘటన అనంతరం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, సిక్కిం పోలీసులు, అగ్నిమాపక, అత్యవసర సేవల బృందాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. అయితే సొరంగంలో మీథేన్ గ్యాస్ స్థాయిలు అధికంగా ఉండటంతో రక్షణ సిబ్బంది లోపలికి వెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదనంగా ఎన్‌హెచ్‌పీసీకి చెందిన ఆరుగురు సిబ్బంది కూడా లోపలే ఉన్నట్లు సమాచారం. సొరంగంలోకి ప్రవేశించిన తొలి సహాయక బృంద సభ్యులు మీథేన్ ప్రభావంతో శ్వాస తీసుకోవడంలో పలు సమస్యలను ఎదుర్కొన్నారు. వారిని వెంటనే బయటకు తీసుకువచ్చి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జి ప్రజాస్వామ్యానికి మచ్చ: వెంకట్రాములు

- అరెస్టు చేసిన నిరసనకారులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**కరపత్రం ప్రతినిది వరంగల్, జూలై 21**



నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులు, యువత, వారి తల్లిదండ్రులు, నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జి చేయడం, బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, అరెస్టులకు పాల్పడడాన్ని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా ఖండించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెంకట్రాములు మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేయడం, తీవ్ర గాయాలకు గురిచేయడం, బాష్పవాయు గోళాలు ప్రయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. శాంతియుతంగా జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన వాంగ్ చుంగ్‌ను అరెస్టు చేయడం కూడా అన్యాయమని పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద నిరసన వేదికను తొలగించి నప్పటికీ, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాదిమంది ఆందోళనలో పాల్గొనడం ఉద్యమ తీవ్రతకు నిదర్శనమని వెంకట్రాములు తెలిపారు. ఉద్యమం ఉధృతరూపం దాల్చిన నేపథ్యంలో నిరసనకారుల ప్రతినిధులతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా చర్చలు జరపడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయడం, నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. లాఠీలు, అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను అణచివేయలేరని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాలరాయడం సరికాదని వెంకట్రాములు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని వీడి విద్యార్థుల డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమం మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాల కార్తీక్ ఆధ్వర్యంలో.. ఘనంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

- కాకతీయ యూనివర్సిటీ తొలి గేటు వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులు
- ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యూత్ కాంగ్రెస్ నాయకులు

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, జూలై 21**





వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి 58వ జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాల కార్తీక్ ఆధ్వర్యంలో మంగళవారం కాకతీయ యూనివర్సిటీ తొలి గేటు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి విద్యార్థులు, యువ నాయకులతో కలిసి సంబరాలు జరుపుతూ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా అల్వాల కార్తీక్ మాట్లాడుతూ, ప్రజా సేవలో నిత్యం ముందుండే ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. అలాగే వరంగల్ పశ్చిమను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా ఆయన నాయకత్వం కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ తీగల ప్రేమ్‌చంద్, డాక్టర్ ఓ. రాజేందర్, మట్టెడ కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాంబరాజు రాజకుమార్, ఎండీ జాఫర్, భీమ వినయ్ కుమార్, మహ్మద్ ఖుర్షిత్, మార్త వరుణ్ బాబు, శివకుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్యామ్, సౌరం రాహుల్ వర్ధన్, యువజన కాంగ్రెస్ నాయకులు మింటూ, ఇల్లందుల వివేక్, లక్కీ, గాద వివేక్‌తో పాటు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్‌లో ఉపాధి హామీ పథకం అమలుపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ డా. కడియం కావ్య

- పార్లమెంట్‌లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అమలు, ఉపాధి కల్పన, వేతనాలపై వివరణ కోరిన ఎంపీ
- అర్హ కుటుంబాల్లో దాదాపు 100 శాతం మందికి పని కల్పించినట్లు కేంద్రం వెల్లడి

**కరపత్రం ప్రతినిది బ్యూరో, జులై 21**



వరంగల్ జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) అమలు, ఉపాధి కల్పన, వేతనాల చెల్లింపుల స్థితిగతులపై వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డా. కడియం కావ్య పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉపాధి కోరిన అర్హ కుటుంబాలకు ఎంత మేర పని కల్పించారు? ఒక్కో కుటుంబానికి సగటున ఎన్ని పనిదినాలు లభించాయి? వేతనాల చెల్లింపుల్లో బకాయిలు ఉన్నాయా? అనే అంశాలపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి వివరణ కోరారు.
ఈ ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాస్వాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, వరంగల్ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కోరిన అర్హ కుటుంబాల్లో 99.99 శాతం మందికి, 2025-26లో 99.97 శాతం మందికి ఉపాధి కల్పించారు. అలాగే ఒక్కో కుటుంబానికి 2024-25లో సగటున 41.12 పనిదినాలు, 2025-26లో 27.89 పనిదినాలు లభించినట్లు తెలిపారు.
ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించడంలో వరంగల్ జిల్లా మెరుగైన ఫలితాలు సాధించడం సంతోషకరమని అన్నారు. ప్రజల సమస్యలను పార్లమెంట్ వేదికగా నిరంతరం ప్రస్తావిస్తూ, సంక్షేమ పథకాల అమలుపై పర్యవేక్షణ కొనసాగిస్తానని తెలిపారు.
వరంగల్ జిల్లాలో ఉపాధి హామీ కూలీల వేతనాల చెల్లింపుల్లో ఎలాంటి పెండింగ్ బకాయిలు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడం సానుకూల పరిణామమని ఆమె పేర్కొన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానం ద్వారా కూలీల ఖాతాల్లోకి నేరుగా వేతనాలు జమ కావడం వల్ల పారదర్శకత పెరిగిందని అన్నారు.
భవిష్యత్తులో ఉపాధి కల్పన రోజులను మరింత పెంచడంతో పాటు మహిళలు, బలహీన వర్గాల భాగస్వామ్యాన్ని విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు డా. కడియం కావ్య తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల సృష్టి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎంపీ ఈ సందర్భంగా కోరారు.

# జంతర్ మంతర్‌లో విద్యార్థులపై లాఠీచార్జ్ సిగ్గుచేటు

- నీట్ ప్రశ్నపత్రం లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్

**కరపత్రం ప్రతినిది వరంగల్,జూలై 21**



న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై నిష్పక్షపాతమైన,సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్(ఏఐఎస్‌బీ)రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థులు,తల్లిదండ్రులకు ఉన్న విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీసిందన్నారు.ప్రభుత్వ పరీక్షల విశ్వసనీయతపై ఇప్పటికే అనేక సందేహాలు నెలకొన్న సమయంలో ఇలాంటి ఘటనలు విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.ప్రశ్నపత్రం లీక్ ఘటన వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసేందుకు పారదర్శకమైన దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం,తమ రాజ్యాంగబద్ధమైన హక్కుగా శాంతియుత నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసు బలాన్ని ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం,బాష్పవాయు గోళాలను ప్రయోగించడం,పలువురు విద్యార్థులు గాయపడినట్లు సమాచారం రావడం అత్యంత దురదృష్టకరమని అన్నారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని,ఆ హక్కును అణచివేయడానికి చేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని స్పష్టం చేశారు.నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటనపై స్వతంత్ర, సమగ్ర,పారదర్శక దర్యాప్తు జరిపి అసలు నిందితులను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని,బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు.అదేవిధంగా,ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై నమోదు చేసిన అన్ని కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## కిసాన్ ఘాట్ వద్ద నిరసనకు వేలాదిగా రైతుల రాక పోలీసుల కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

హర్యానా-పంజాబ్ సరిహద్దులోని శంభు బార్డర్ వద్ద హైటెన్షన్ నెలకొంది. మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు పంజాబ్, హర్యానా నుంచి ఢిల్లీ వైపుగా వేలాది మంది రైతులు బయలుదేరారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద నిరసన తెలిపేందుకు అన్నదాతలు వస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా తక్కువ ధరకు, సబ్సిడీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు నిరసనకు దిగుతున్నారు. అయితే, వారిని అడ్డుకునేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద మహాపంచాయత్‌కు 'దేశ్ బచావో మోర్చా' పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా సుమారు 550 రైతు సంఘాలు, సామాజిక సంస్థలు ఇందులో పాల్గొననున్నాయి. అయితే, నేడు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ఢిల్లీకి బయలుదేరుతున్నట్లు ప్రకటించింది. దీంతో శంభు సరిహద్దును పోలీసులు మూసివేశారు. రైతులను అడ్డుకునేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ అన్నదాతలను నిలువరించేందుకు చర్యలు చేపట్టారు. బారికేడ్లు, ఇనుప కంచెలను ఏర్పాటు చేశారు. సందర్భంగా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ పంజాబ్ నాయకుడు జర్మన్‌జిత్ సింగ్ బండాలా మాట్లాడారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం భారతీయ రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, విస్తృత ప్రజానీకంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. భారతదేశంలోని చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను విస్మరిస్తూ అమెరికన్ కంపెనీలు, రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ఈ ఒప్పందం లక్ష్యమని బండాలా ఆరోపించారు. నేడు పంజాబ్ రైతులతో పాటు హర్యానా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల నుంచి నిరసనలో పాల్గొనేందుకు అన్నదాతలు వస్తున్నారని తెలిపారు.

# వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుడు అరెస్ట్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

చందుర్తి సబ్‌డివిజన్ పరిధిలోని రుద్రంగి గ్రామానికి చెందిన వివాహిత బాధవేణి కావ్య ఆత్మహత్య కేసులో నిందితుడు సూర యాదయ్యను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రవీందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు యాదయ్య బాధితురాలిని ఫోన్ ద్వారా అసభ్యంగా, లైంగిక వేధింపులకు గురిచేయడంతో ఆమె తీవ్ర మానసిక క్షోభకు లోనై ఆత్మహత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు అతడిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

# 5వ వార్డు ప్రజల వినతికి మున్సిపల్ చైర్మన్ సానుకూల స్పందన




ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీటి సరఫరా లక్ష్యమని హామీ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జులై 21**

జమ్మికుంట పట్టణంలోని 5వ వార్డు ప్రజలు తమ కాలనీలోని కొన్ని గృహాలకు ఇప్పటికీ మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు కాలేదని పేర్కొంటూ మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)ను మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తమ ఇళ్లకు కూడా మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయించి శుద్ధమైన తాగునీటి సౌకర్యం కల్పించాలని వారు కోరారు.వినతిని స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) సమస్యపై సానుకూలంగా స్పందించారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని మిర్జిడు గ్రామం, కొత్తపల్లి ప్రాంతాల్లో అమృత్ పథకం ద్వారా తాగునీటి సరఫరా కోసం కొత్త పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదే విధంగా 5వ వార్డులో పైప్‌లైన్ లేని గృహాలను గుర్తించి, ఆయా ఇళ్లకు కూడా మిషన్ భగీరథ కనెక్షన్ అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడం మున్సిపాలిటీ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని చైర్మన్ పేర్కొన్నారు. సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావడం అభినందనీయమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో యాట్ల అవినాష్, రమేష్, కాళోజీ లక్ష్మణ్, సంజీవ్, శ్రీనివాస్, ప్రణీతతో పాటు 5వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో రూ.19 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన.



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.19 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వికలాంగుల కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు, అవసరమైన అన్ని మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వరాల నర్సింగం , గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం , మున్సిపల్ అధికారులు, వికలాంగుల సంఘ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జమ్మికుంట మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం జన్మదిన వేడుకలు





రైతు సేవే లక్ష్యమని చైర్‌పర్సన్ వ్యాఖ్య -- ఉద్యోగుల హెల్త్ ఇన్సూరెన్స్ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 21:**

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం జన్మదిన వేడుకలను మంగళవారం మార్కెట్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తూ చైర్‌పర్సన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ ప్రాంగణం సందడిగా మారగా, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆమె సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సహకారంతో ఉత్తర తెలంగాణలోనే రెండవ అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా గుర్తింపు పొందిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీకి చైర్‌పర్సన్‌గా రైతులకు సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.తన భర్త పుల్లూరి సదానందం గత 22 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేశారని, ఆ సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తమ కుటుంబానికి ఈ బాధ్యతను అప్పగించిందని తెలిపారు. రైతాంగ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు మేలు చేసే ప్రతి కార్యక్రమానికి తమ పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.మార్కెట్ ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. తన జన్మదిన వేడుకలను ప్రేమాభిమానాలతో నిర్వహించిన మార్కెట్ కార్యదర్శి, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.అనంతరం మార్కెట్ కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ, చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని ప్రశంసించారు. రైతాంగ సమస్యల పరిష్కారంలో ఆమె చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరింత ప్రజాసేవ చేసి రైతులకు, ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ సహాయ కార్యదర్శి రాజా, సూపర్వైజర్లు బాబా, సురేందర్, అరుణ్, ప్రదీప్, శంకర్ రెడ్డి, వీరన్న, సంపత్, గట్టయ్యతో పాటు మార్కెట్ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ లో బిఎల్ఎ సూపర్వైజర్ సమీక్ష సమావేశం పాల్గొన్న నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ఎస్ ఐ ఆర్ కోఆర్డినేటర్ అన్వేష్ రెడ్డి

ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను అత్యంత బాధ్యతగా పాద దర్శకంగా నిర్వహించాలి

అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలి

ఓటర్ నమోదు మార్పులు తొలగింపులు చిరునామా మార్పు వంటి ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట జులై 21**

మెదక్ జిల్లానర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయి కృష్ణ గార్డెన్స్‌లో నర్సాపూర్ నియోజకవర్గ ఎస్ ఐ ఆర్--బి ఎల్ ఏ లా సూపర్వైజర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి నర్సాపూర్ ఎస్ ఐ ఆర్ కోఆర్డినేటర్ శ్రీ అన్వేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి బి ఎల్ ఏ సూపర్వైజర్ తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని, అనర్హుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని తెలిపారు.ఓటరు నమోదు, మార్పులు, తొలగింపులు, చిరునామా మార్పు వంటి ప్రతిదరఖాస్తును క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు వేగవంతంగా పూర్తి చేయాలని వారికి తెలియజేశారు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారికి అవగాహన కల్పిస్తూ, సమన్వయంతో పనిచేయాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో బి ఎల్ ఏ లు, సూపర్వైజర్లు కీలక పాత్ర పోషించాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని ఆవుల రాజిరెడ్డి ఆదేశించారు ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల, పట్టణ అధ్యక్షులు, బి ఎల్ ఏలు, సూపర్వైజర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# ఇల్లందకుంటలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం విస్తృత పర్యటన పోలీస్ స్టేషన్ తనిఖీ -- సీసీ కెమెరాల ప్రారంభం

వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూలై 21:**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మంగళవారం ఇల్లందకుంట మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, ప్రజా భద్రతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, శాంతిభద్రతల నిర్వహణ, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడంతో పాటు ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పనిచేయాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు.అనంతరం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కమిషనర్ గౌస్ ఆలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు నేరాల నివారణకు, అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పోలీసు శాఖతో గ్రామస్థులు సమన్వయంతో పనిచేస్తే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామం సురక్షిత గ్రామంగా మారాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆయన అన్నారు.తదుపరి వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన కమిషనర్, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని, పచ్చదనాన్ని కాపాడడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని పెంచి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రకృతిని ప్రేమిస్తూ పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేసి, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు అందజేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో హుజురాబాద్ ఏసీపీ మాధవి, సీఐ పులి వెంకట్, ఎస్సై క్రాంతికుమార్, పోలీసు సిబ్బంది, గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








# రైతు భరోసా కోసం ఈనెల 31వ తేదీ వరకే దరఖాస్తులు తీసుకుంటాం మాసాయిపేట మండల వ్యవసాయ అధికారిని కవిత

రైతు భరోసా అందని రైతులు రైతు భరోసా రాని వారు దరఖాస్తులు చేసుకోవాలి ఈనెల 31వ తేదీ వరకు గడువు

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట జులై 21**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 'రైతు భరోసా' పథకం కొత్త దరఖాస్తులు బ్యాంక్ వివరాల అప్డేట్ కోసం మరొక అవకాశం ఈ నెల 31 తేదీవరకు అవకాశం కల్పించిందని మాసాయిపేట మండల వ్యవసాయ అధికారిని కవిత తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూకొత్త దరఖాస్తులు కొరకు ది.15/06/2026 వరకు కొత్త భూ పట్టా పాసు బుక్ వచ్చిన రైతులు ఇప్పటి వరకు భూ పట్టా పాసుబుక్ కలిగి ఉన్న కూడా 'రైతు భరోసా' పొందని అర్హులైన రైతులు వారి బ్యాంక్ వివరాలు నమోదు చేయించుకొని రైతులు వెంటనే 'రైతు భరోసా' కొరకు నమోదు చేసుకొనగలరని

**'రైతు భరోసా' దరఖాస్తు కొరకు కావలసిన పత్రాలు:**

రైతు భరోసా అప్లికేషన్ ఫారం.పట్టాదార్ యొక్క భూమి పట్టా పాసుబుక్ పి పి బి కాపీ.పట్టాదార్ యొక్క ఆధార్ కార్డు.పట్టాదార్ యొక్క బ్యాంక్ పాస్ బుక్ మొదటి పేజీ (లేదా) క్యాన్సిల్ చెక్. పట్టాదార్ యొక్క మొబైల్ నంబర్.నమోదు కేంద్రం రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోగలరనిదరఖాస్తు కొరకు చివరి తేదీ: 31 వరకు మాత్రమే అవకాశం ఉన్నదనిఅర్హులైన ప్రతి ఒక రైతు తప్పకుండా రైతు భరోసా" దరఖాస్తు కొరకు చివరి 31తేదీ.. కన్నా ముందే తమ యొక్క వివరాలు నమోదు చేసుకుని రైతు భరోసా ప్రయోజనం పొందగలరని పత్రిక పరంగా రైతులకు తెలియజేయడం జరుగుతుందని

**రైతులకు గమనిక**

"రైతు భరోసా" పథకంలో భాగంగా ఎవరైనా రైతులు తగు కారణములు వలన బ్యాంక్ అకౌంట్ మార్చాలి అనుకునే రైతులు తేదీ. 31వరకు మీ వ్యవసాయ విస్తరణ అధికారి ని సంప్రదించిమార్చుకోవాల్సిందిగా మనవి చేస్తున్నామని

**కావలసిన పత్రాలు:**

రైతు భరోసా' అప్లికేషన్ ఫారం రైతు యొక్క పట్టా పాస్ బుక్ మీ యొక్క బ్యాంక్ అకౌంట్ రైతు యొక్క ఆధార్ కార్డు దరఖాస్తు కు గత చేసి రైతు వేదికలో ఉన్న వ్యవసాయ శాఖ సిబ్బందికి ఇవ్వాలని వారు తెలియజేశారు.

